క్లుప్తంగా

నేడు అమ్మవార్ల తీర్థం


నూకాలమ్మ వారు


రావులమ్మ వారు

తాళ్లరేవు: మండలంలోని పిల్లంక గ్రామ దేవతలు నూకాలమ్మ, రావులమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం తీర్థం జరగనుంది. ఇందులో భాగంగా అమ్మవార్ల జాతరను శనివారం రాత్రి గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవార్లకు మొక్కుబడులు సమర్పించారు. తీర్థ మహోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.

నేటితో ముగియనున్న క్రీడా శిక్షణ

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా స్థలంలో కుడుపూడి గోపాలకృష్ణ గోఖలే, కుడుపూడి ప్రభాకరరావు మెమోరియల్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో 30 రోజులుగా జరుగుతున్న ఉచిత వేసవి బాస్కెట్‌బాల్ క్రీడా శిక్షణ ఆదివారంతో ముగియనుంది. ఇందులో పాల్గొన్న క్రీడాకారులందరికీ ప్రశంసాపత్రాలు, మెమోంటోలు ఇస్తామని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు తెలిపారు. ఆదివారం సాయంత్రంతో ముగిసే ఈ క్రీడా శిక్షణ శిబిరంలో దాదాపు 200 మంది బాల బాలికలు పాల్గొన్నారని చెప్పారు. 25 ఏళ్లుగా వేసవి కాలంలో ఆ రెండు ట్రస్ట్‌లచే బాల బాలికలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు, ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తెలిపారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, మంత్రి వాసంశెట్టి సుభాష్, ఓఎన్జీసీ విశ్రాంత మేనేజర్ డీఎంకే శేఖర్ చేతుల మీదుగా శిక్షణలో పాల్గొన్న క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు, మెమోంటోలు ఇస్తామన్నారు.

యువజన విభాగాల నిరసన

యానాం: పుదుచ్చేరి సీఎం రంగసామి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శనివారం వివిధ విద్యార్థి, యువజన విభాగాలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. విద్యావంతులైన యువత పశువులను పెంచడం, మినీ పాడి పరిశ్రమలను సృష్టించడం ద్వారా వ్యవసాయ రంగ ఉద్యోగాల ద్వారా ఆదాయం సంపాదించడానికి వెనుకాడకూడదని ఇటీవల పాన్‌లైట్ ఐస్‌క్రీమ్ ఫ్యాక్టరీ శంకుస్థాపన సందర్భంగా సీఎం రంగసామి సూచించారు. ఆయన వ్యాఖ్యలు తిరోగమనంగా ఉన్నాయని నిరసనకారులు ఆరోపించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్, ఇండియన్ యూత్ కాంగ్రెస్, రివల్యూషనరీ స్టూడెంట్స్ ఫెడరేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సేవలు ప్రశంసనీయం


రమాదేవిని సత్కరిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి, ఎంపీడీఓ బాబ్జీరాజు

అమలాపురం రూరల్: విధి నిర్వహణలో జూనియర్ అసిస్టెంట్ సరిపెల్ల రమాదేవి సేవలు ప్రశంసనీయమని ఎంపీడీఓ ఉంగ్రు బాబ్జీరాజు కొనియాడారు. అమలాపురం మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రమాదేవి ఉద్యోగ విరమణ సందర్భంగా ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి అధ్యక్షతన సన్మాన సభ జరిగింది. పీఆర్ డీఈఈలు పీఎస్ రాజకుమార్, అన్యం రాంబాబు, ఈఓపీఆర్డీ మంగాదేవి, సూపరింటెండెంట్ కుమారి, ఎంపీటీసీ దొంగ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత సొసైటీ మాజీ ఉపాధ్యక్షుడి మృతి


గణపతిరావు (ఫైల్)

అమలాపురం రూరల్: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన బండారులంకకు చెందిన చేనేత సంఘం నేత కటకం గణపతిరావు (60) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారు. గణపతిరావు చేనేత సొసైటీ ఉపాధ్యక్షుడిగా పనిచేసి చేనేత కార్మికులకు సంక్షేమ పథకాలు అందేలా చూశారు. ఆయన మృతికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామిశెట్టి శ్రీనివాసరావు, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు జాన్ గణేష్, సంఘ నాయకులు కాలేపు శ్రీనివాసరావు, చింతా ఉమామహేశ్వరరావు, అంకం పెదరాజు తదితరులు సంతాపం తెలిపారు.

పాఠశాలకు ఇన్వర్టర్ బహూకరణ

పి.గన్నవరం: నరేంద్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు 1991–92 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు శనివారం రూ.18 వేల విలువైన ఇన్వర్టర్‌ను బహూకరించారు. పాఠశాల హెచ్ఎం అక్కిరెడ్డి సూర్యనారాయణ పూర్వ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘ నాయకులు పేపకాయల చంద్రరావు, గుత్తుల సోంబాబు, కుసుమ ఆనందరాజు, కె.రవికుమార్, యల్లమిల్లి చంద్రయ్య, పిడకాల మోషే పాల్గొన్నారు.

నిధులున్నా కాలయాతన

- నత్తనడకన అభివృద్ధి పనులు
- రూ.8 కోట్ల ఎమ్మెల్యే ల్యాడ్ రూ.39 కోట్ల సీఎస్ఆర్ నిధులకు గ్రహణం


యానాంలో గోదావరి సమీపంలో నివాసాల చెంత నిలిచిపోయిన రహదారి పనులు


అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్ (ఫైల్)

యానాం: అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు పరిస్థితి ఉంది.. రూ. కోట్లున్నా అభివృద్ధి పనుల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం వెంటాడుతోంది.. మౌళిక వసతుల కల్పనకు నిధులు మంజూరైనా పనులు పూర్తి చేయించడంలో శ్రద్ధ కొరవడింది.. ఎమ్మెల్యే ల్యాడ్, సీఎస్ఆర్ తదితర నిధులు రూ.కోట్లలో వచ్చినప్పటికీ పనులను ఆలస్యం చేస్తుండటంపై పలు అనుమానాలు రేకెత్తిస్తోంది. నాలుగేళ్లలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌కు యానాం నియోజకవర్గంలో వివిధ పనులకు ఎమ్మెల్యే ల్యాడ్ నిధులు రూ.8 కోట్లు విడుదలయ్యాయి. దీంతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో అధికంగా సిమెంట్ రోడ్లు, డ్రైన్లు, కాంపౌండ్ వాల్స్, ప్రధాన రహదారుల నిర్మాణాలు, బరెల్ గ్రౌండ్స్ అభివృద్ధి, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం తదితర వాటికి భూమిపూజలు చేశారు. అయితే ఆ పనులు కాంట్రాక్టర్లతో పూర్తి చేయించాల్సిన బాధ్యత సంబంధిత పీడబ్ల్యూడీ, మున్సిపల్ అధికారులపై ఉన్నా వారు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. పనులు పూర్తి చేసినా బిల్లులు చేయడం లేదని పలువురు కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని పనులు టెండర్ల అప్రూవల్ దశలో ఉండగా, సుమారు 50 శాతం పనులు పీడబ్ల్యూడీ శాఖ పూర్తి చేయడం లేదు. ప్రారంభం కాకుండా పలు పనులకు సంబంధించి నిధులు మున్సిపాలిటీ అకౌంట్‌లో రూ.6 కోట్లు ఉన్నాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చని స్థానికులు అంటున్నారు.

ఎక్కడివి అక్కడే..

పట్టణంలో రూ.12.50 లక్షలతో చేపట్టిన పనులు ఎక్కడికక్కడే నిలిపివేశారు. గణపతికాలనీలో రోడ్లు, డ్రైన్ల కోసం రూ.25 లక్షలు మంజూరయ్యాయి. త్యాగరాజ వీధిలో రూ.13 లక్షలతో చేపట్టిన డ్రైన్, వీకే కాలనీలో రీడింగ్ రూమ్‌కు రూ.5 లక్షలు, సావిత్రినగర్‌లో సీసీ రోడ్లు, డ్రైన్లకు రూ.19 లక్షలు, గుమ్మళ్లవీధిలో రూ.15 లక్షలు, దరియాలతిప్పలో సీసీ క్రికెట్ ప్రాక్టీస్ పిచ్‌కు రూ.12 లక్షలు, షేక్‌లాలా వీధిలో డ్రైన్, సీసీ రోడ్లకు రూ.10 లక్షలు, స్టాబోర్డు కాలనీకి రూ.8 లక్షలు, పోలేరమ్మనగర్, ఫిషర్‌మెన్ పేటకు రూ.7 లక్షలు, శ్రీరామ్‌నగర్‌కు రూ.32 లక్షలు, గణపతినగర్‌కు రూ.4 లక్షలు.. అదేవిధంగా ఆదిద్రావిడ శాఖ ద్వారా సుమారు 2021–22లో రూ.కోటికి పైగా నిధులతో, 2022–23లో రూ.1.50 కోట్లతో పలు పనులకు శ్రీకారం చుట్టారు. 2023–24లో రూ.కోటితో చేపట్టిన కొన్ని పనులు పూర్తయినా, మరికొన్ని అసంపూర్తిగా మిగిలాయి. 2024–25లో సైతం 8 పనులకు నిధులు మంజూరయ్యాయి.

భూమిపూజ చేసి.. వదిలేసి

ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధులు రూ.39 కోట్ల ద్వారా సుమారు 33 పనులకు నిర్ణయించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జరిగే ఈ పనులకు భూమి పూజలు సైతం చేశారు. అయితే కొన్ని పనులు చేపట్టినప్పటికీ మరికొన్ని టెండర్‌దశ దాటి ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల తమను మున్సిపల్ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని పలువురు కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ ఏఈగా పనిచేసిన రామును బదిలీ చేయడం అనంతరం జూనియర్ ఇంజినీర్‌ను వేయడంతో పనులు నిలిచిపోయాయని అంటున్నారు. ప్రస్తుతం పీడబ్ల్యూడీ శాఖ నుంచి డిప్యూటేషన్‌పై ఇన్‌చార్జి ఇంజినీర్‌ను నియమించారు.

ఆలస్యం చేస్తుండడంతో..



ఎమ్మెల్యే ల్యాడ్‌తో పాటు ఎంపీ, నామినేటెడ్ ఎమ్మెల్యే నిధులు, ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధులు రూ.కోట్లు మంజూరవుతున్నా పనులు కావాలనే అధికారులు ఆలస్యం చేస్తుండటంతో అభివృద్ధికి విఘాతం ఏర్పడుతుంది. ఈ ఏడాది ఎమ్మెల్యే ల్యాడ్ నిధులు రూ.3 కోట్లు చేశారు. రూ.77 లక్షలకు మాత్రమే టెండర్లు వేశారు. ఇంకా రూ.2.23 కోట్లకు సంబంధించి పనులు జరగాల్సి ఉంది.

– గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఎమ్మెల్యే, యానాం

ఆక్వాతో తగ్గిన తలసరి ఆదాయం


చెయ్యేరులో సభావేదికపై మార్గదర్శులను సన్మానిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

కాట్రేనికోన, ముమ్మిడివరం, అమలాపురం టౌన్, ఉప్పలగుప్తం: అందాల కోనసీమ జిల్లాలో ఆక్వా చెరువులతో తలసరి ఆదాయం తగ్గిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అన్నారు. చెయ్యేరులో కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధ్యక్షతన ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆధ్వర్యంలో బంగారు కుటుంబం– మార్గదర్శులు కార్యక్రమాన్ని సీఎం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ వరితో పాటు అంతర పంటగా కోకో వంటి పంటలను వేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. మడికి లక్ష్మి భర్త క్యాన్సర్‌తో మృతి చెంది 11 నెలలు గడిచినా పింఛను ఇవ్వడం లేదని ఆమె చెప్పగా, ఎందుకు రావడం లేదని కలెక్టర్‌ను సీఎం నిలదీశారు. చెయ్యేరులో పీ4 సర్వేలో 141 బంగారు కుటుంబాలను గుర్తించారు. ఇందులో కొందరిని దత్తత తీసుకునేందుకు తొమ్మిది మంది మార్గదర్శులు ముందుకు వచ్చారు. సీఎంకు వినతి పత్రం ఇవ్వడానికి వచ్చిన టీడీపీ కార్యకర్తను పోలీసులు అడ్డుకున్నారు. కాకినాడ నుంచి పింఛను కోసం వచ్చిన ఇద్దరు మహిళలు (ఒకరు డయాబెటిక్ పేషెంట్) రెండు గంటలు ఎండలో పడిగాపులు కాశారు. ఆక్వా పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలు, రైతులు, చేనేత కార్మికులు, మత్స్యకారులకు ప్రత్యేకించి హామీలు ఇవ్వలేదు.

కాలిబాట వంతెన నిర్మాణానికి శ్రీకారం


విలసవిల్లిలో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

ఉప్పలగుప్తం: విలసవిల్లి గ్రామ పంచాయతీ పరిధి గోకనవిల్లి ప్రాంతంలో కాలిబాట వంతెన పనులకు సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి శ్రీకారం చుట్టారు. అమలాపురం మేజర్ డ్రెయిన్‌పై గోకనవిల్లి ప్రాంతంలో శనివారం కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఒక భాగమైన గోకనవిల్లి ప్రాంతానికి గ్రామానికి మధ్యలో డ్రెయిన్ ఉండటంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. 6 దశాబ్దాల క్రితం నిర్మించిన కాలిబాట వంతెన శిథిలమవ్వడంతో ప్రజలు గ్రామ పంచాయతీ పనులు, రేషన్ నిమిత్తం గ్రామానికి రావాలంటే సుమారు 5 కిలోమీటర్లు తిరిగి వచ్చేవారన్నారు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా అర కిలోమీటరు వ్యవధిలో గ్రామానికి వాహనాలు వచ్చే విధంగా వంతెనను 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి నిర్మించనున్నామని సర్పంచ్ తెలిపారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, జంగా నాగమణి, ముషిణి లింగేశ్వరరావు, పుత్సల ఏసు, నందుల సత్య, శీలం రామదుర్గారావు, ముషిణి రాంబాబు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సౌకర్యాలను సద్వినియోగం చేసుకోండి



జిల్లా స్థాయి ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభోత్సవంలో క్రీడాకారులు

యానాం: నియోజకవర్గ పరిధిలో క్రీడా సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ మున్సిపల్ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్, ఎస్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి సామ్యూల్ అన్నారు. శనివారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పుట్టినరోజును పురస్కరించుకుని స్థానిక బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జిల్లా స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 2 వరకు జరిగే ఫుట్‌బాల్ పోటీల్లో 10 జట్లు పాల్గొంటున్నాయన్నారు. విజేతకు రూ.15 వేలు, రన్నర్స్‌కు రూ.10 వేల నగదు బహుమతులు అందజేస్తామన్నారు. రిటైర్డ్ సీఐ గూటం శివగణేష్, పాలిమారి సత్యనారాయణ, ఇసుకపట్ల పాపారావు, చింతా రామకృష్ణ, చింతా వెంకన్న, ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు వడ్డి వరప్రసాద్, మల్లవరపు దయ పాల్గొన్నారు.

- మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో కొద్ది రోజులుగా జరుగుతున్న ఎమ్‌కేఆర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. క్వార్టర్స్ ఫైనల్స్‌లో స్మాషర్స్, చాలెంజర్స్ జట్లు గెలిచాయి. ఆదివారం జరిగే సెమీస్‌లో స్మాషర్స్, టైగర్స్ జట్లు, వైపర్స్, చాలెంజర్స్ జట్లు తలపడనున్నాయి.

పొగాకు వాడకంతో ఎన్నో అనర్థాలు



అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి నుంచి ర్యాలీగా వస్తున్న వైద్యులు, సిబ్బంది

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో ప్రపంచ పొగాకు రహిత దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. పొగాకు వాడడంతో కలిగే అనర్థాలు, మానేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వైద్యులు వివరించారు. నేషనల్ కమ్యూనిటిబుల్ డిసీజెస్ కార్యక్రమంలో భాగంగా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుమలత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం ఏరియా ఆస్పత్రి నుంచి నల్ల వంతెన వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డాక్టర్ సుమలత ప్రారంభించారు. పొగాకు వాడడం వల్ల ఎదురయ్యే సామాజిక, ఆర్థిక నష్టాలను ఆమె వివరించారు. ఆస్పత్రి సైకాలజిస్ట్ డాక్టర్ సౌమ్య పసుపులేటి, ఎన్‌టీసీపీ సోషల్ వర్కర్ కొల్లాటి ప్రమీల పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: ప్రపంచ పొగాకు రహిత దినోత్సవాన్ని కిమ్స్ డెంటల్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించారు. పొగాకు ఉత్పత్తుల వాడకంతో అనర్థాలు ఉంటాయని డెంటల్ కళాశాల ప్రిన్సిపాల్ శంకరరావు అన్నారు. అనంతరం కిమ్స్ డెంటల్ కళాశాల హాస్పిటల్ విద్యార్థులు పొగాకు వద్దంటూ అమలాపురం ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రచారం నిర్వహించారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం


బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న దాతలు

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీ పరిధిలోని చినవలసల గ్రామంలో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించి సర్వం కోల్పోయిన బాధితులకు పలువురు దాతలు ఆర్థిక సాయం అందించారు.

మల్లాడి రాంబాబు భార్య భవానీ సమీపంలో ఉన్న చర్చికి వెళ్లిన సమయంలో విద్యుదాఘాతంతో అగ్ని ప్రమాదం సంభవించి సర్వం కోల్పోయారు. వీరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న దాతలు కొండిశెట్టి ఈశ్వరరావు, విల్ల వీర, పోతుల రాజు, అత్తిలి బాబూరావు, కొరిపెల్ల సుబ్రహ్మణ్యం, పెస్సింగి ధర్మారావు, అరదాడి సూరిబాబు తదితరులు సుమారు రూ.22 వేలను అందజేశారు.

నదీ పాయల వద్ద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

పి.గన్నవరం: ఇటీవల గోదావరి నదీపాయల్లో విద్యార్థులు స్నానాలకు వెళ్లి లోతు తెలియక ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో పి.గన్నవరం మండలంలోని పలు ప్రాంతాల్లో హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్టు తహసీల్దార్ పి.శ్రీపల్లవి తెలిపారు. ఇందులో భాగంగా ఎల్.గన్నవరం పుష్కరాల రేవు వద్ద శనివారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అలాగే మండలంలోని నదీ పరివాహక ప్రాంతాలైన జి.పెదపూడి, ఊడిమూడి, బెల్లంపూడి, వైపీ పాలెం, పి.గన్నవరం, ఎల్.గన్నవరం, మానేపల్లి, నాగుల్లంక, వై.కొత్తపల్లి, ఆర్.ఏనుగుపల్లి, కె.ఏనుగుపల్లి, కె.ముంజవరం తదితర గ్రామాల్లో నదీపాయల వద్ద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమంలో వీఆర్ఓ పి.నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్.గన్నవరం పుష్కరాల రేవు వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు →



సీఎం పర్యటనలో పోలీసుల తీరు సరికాదు

ఆలమూరు: విద్యార్థుల సమస్యలను చెబుదామని సీఎం చంద్రబాబు పర్యటించిన ప్రాంతానికి వస్తే పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.రవికుమార్ విమర్శించారు. ఆలమూరులో శనివారం ఆయన మాట్లాడుతూ విద్యారంగానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఉన్న అనేక సమస్యలను వినతిపత్రం రూపంలో అందజేస్తామని చెయ్యేరు వెళితే అక్కడ తమను పోలీసులు అడ్డుకోవడంతో పాటు అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించడం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు. ఇక నుంచి విద్యార్థుల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించే వరకూ రాష్ట్ర వ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు వెంకట్, సతీష్, కుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ ర్యాలీని విజయవంతం చేయండి

మలికిపురం: ఆరోగ్యం కోసం సైకిల్ తొక్కుదాం, పర్యావరణం కోసం సైకిల్ తొక్కుదాం అనే నినాదంతో జూన్ 3న ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా హెల్దీ సైక్లింగ్ గ్రూపు ఆధ్వర్యంలో మలికిపురం డిగ్రీ కళాశాల ప్రాంగణం నుంచి సఖినేటిపల్లి మూడు తూములు సెంటర్ వరకు జరుగుతుంది. అలాగే తిరిగి మలికిపురం గాంధీ బొమ్మల వరకు సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక విశ్వేశ్వరాయపురంలోని వివేకానంద ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. సైకిల్ లవర్స్, ఆరోగ్యాభిలాషులు, వాకర్స్ తమ తమ సైకిళ్లతో విరివిగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ నిషేధం కోసం స్టీల్, రాగి బాటిళ్లతో మంచి నీళ్ళు తెచ్చుకోవాలని, తెల్లని దుస్తులు ధరించి హాజరు కావాలని నిర్వాహకులు తెలిపారు. బోనం రాజు, పీవీవీఎస్ ప్రసాద్, రమేష్ బాబు, నల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో రైతులకు లాభం

అంబాజీపేట: అన్ని రకాల పంటల సస్యరక్షణకు సంబంధించి డ్రోన్ టెక్నాలజీని రైతులు వినియోగిస్తే మంచి ఫలితాలతో పాటు అధిక లాభాలు పొందవచ్చని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి డా.ఎన్‌బీవీ చలపతిరావు అన్నారు. అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రంలో రావేప్ వ్యవసాయ విద్యార్థులతో రైతు సదస్సును కేంద్ర అధిపతి డాక్టర్ ఎం.ముత్యాల నాయుడు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. చలపతిరావు మాట్లాడుతూ రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని అందుకు అనుగుణంగా డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించడం వల్ల ఎన్నో లాభాలు పొందవచ్చన్నారు. రావేప్ (గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమం) వ్యవసాయ విద్యార్థులు 19 అంశాలతో నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం వ్యవసాయ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, రాబోయే తరాలకు ఉపయోగపడే నూతన ఉద్యానసాగుపై ప్రదర్శించిన నృత్య రూపకం రైతులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ వి.గోవర్ధన్‌రావు, డాక్టర్ వి.అనూష, డాక్టర్ బి.నీరజ, డాక్టర్ ఎ.కిరీటి, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, ఎంపీటీసీ సత్యవతి, రైతులు, రావేప్ విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులను నర్సులుగా నియమించాలి

యానాం: యానాం జిప్‌మెర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఎటువంటి అక్రమాలకు తావులేకుండా అర్హులను నర్సింగ్ ఆఫీసర్స్‌గా నియమించాలని శనివారం బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు అర్థాని దినేష్ డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన సుమారు 50 నర్సింగ్ పోస్టులను భర్తీ చేస్తున్నారన్నారు. రాత పరీక్షలో ప్రతిభ చాటిన వారికి, అనుభవజ్ఞులను మాత్రమే ఎంపిక చేయాలని కోరారు. సమావేశంలో వీసీకే పార్టీ సెక్రటరీ మెల్లం చిన్న, బలగం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత బాలుడికి చేయూత


బాలుడికి నగదు అందజేస్తున్న కృష్ణ, మహేష్‌బాబు అభిమాన సంఘాల నాయకులు

అమలాపురం టౌన్: సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా అమలాపురంలో రీ రిలీజ్ అయిన ఖలేజా సినిమా ప్రదర్శన ద్వారా వచ్చిన నగదును ప్రేగు వ్యాధితో బాధపడుతున్న బాలుడు దంగేటి భార్గవ్ చంద్ర వినయ్‌కు కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు అందించారు. ఆ బాలుడి వైద్య ఖర్చుల నిమిత్తం ఈ నగదు ఉపయోగించుకోవాలని అభిమాన సంఘాల నాయకులు కోరారు. అలాగే స్థానిక లలిత థియేటర్ వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. అభిమాన సంఘాల నాయకులు కొప్పిశెట్టి నరసింహ, పాటి రవి, దొమ్మేటి శ్రీనివాస్, కాలే గోవిందు, సంసాని రమేష్, దంగేటి కనక, యల్లమిల్లి విజయ్, థియేటర్ మేనేజర్ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు. .

మార్పుతోనే మలేరియా అంతం


బ్యానర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్ఓ దుర్గారావుదొర, వెంకటేశ్వరరావు తదితరులు

అమలాపురం టౌన్: మన అందరిలో మార్పుతోనే మలేరియా అంతం అవుతుందని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం.దుర్గారావు దొర అన్నారు. ఈ నెల 1 నుంచి నెలాఖరు వరకూ జరగనున్న మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలో పలు వైద్య సూచనలతో ముద్రించిన బ్యానర్లను డాక్టర్ దుర్గారావు దొర ఆవిష్కరించారు. జిల్లా మలేరియా అధికారి ఎస్.వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇళ్ల ఆవరణలో నీటి నిల్వలు లేకుండా, దోమల నిర్మూలనకు చర్యలు చేపడుతూ దోమ తెరలను విధిగా ప్రతి ఒక్కరూ వాడాలని వెంకటేశ్వరరావు సూచించారు. జిల్లాలోని వార్డు, గ్రామ సచివాలయాలు, ఆరోగ్య కేంద్రాల వద్ద మలేరియా నిర్మూలనకు ఈ నెల రోజులూ అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. జిల్లా మలేరియా శాఖ సిబ్బంది, సబ్ యూనిట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

కోరింగ అభయారణ్యం సందర్శన


అభయారణ్యంలో బోటు షికారు చేస్తున్న ట్రైనీ ఎఫ్‌బీఓలు

తాళ్లరేవు: పర్యాటక ప్రదేశం కోరింగ అభయారణ్యాన్ని శనివారం ట్రైనీ ఎఫ్‌బీఓలు సందర్శించారు. తెలంగాణ నుంచి వచ్చిన 40 మంది సభ్యులు అభయారణ్యంలోని ప్రముఖ ప్రదేశాలన్నింటినీ తిలకించారు. చెక్కల వంతెనలపై నడుస్తూ, బోటు షికారు చేసి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం జరిగిన సదస్సులో అభయారణ్యంలోని మడ అడవుల విశిష్టత, పక్షుల వివరాలను ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ వారికి వివరించారు. అలాగే తాబేళ్ల, వన్యప్రాణుల సంరక్షణకు చేపట్టాల్సిన అంశాలను వివరించారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎస్.వీరభద్రరావు, కె.సిద్ధార్థ, ఎఫ్‌బీఓలు కె.మహేష్, జి.గోపి నాగేంద్రకుమార్, పి.సంధ్యారాణి, సీహెచ్ ధనలక్ష్మి, ఎం.మధుబాబు పాల్గొన్నారు.

3న జిల్లా స్థాయి ఓపెన్ చెస్ పోటీలు

అమలాపురం టౌన్: స్థానిక విద్యానిధి స్కూలులో జూన్ 3న జిల్లా స్థాయి ఓపెన్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి తాడి వెంకట సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో సత్తా చాటిన నలుగురు క్రీడాకారులను ఈ నెల 7, 8 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. వయస్సుతో నిమిత్తం లేకుండా ఎవరైనా ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 98491 75179 నంబర్‌లో సంప్రదించాలని సురేష్ విజ్ఞప్తి చేశారు.